క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మకర జ్యోతి దర్శనం



పాత గుంటూరు: స్థానిక ఏలూరు బజారు కోదండ రామాలయం వద్ద వాసవి మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో మకర సంక్రాంతి సందర్భంగా మకర జ్యోతి దర్శన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని మకర జ్యోతిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని నాళం శివప్రసాద్, పాదర్తి ఉమామహేశ్వరరావు, పులిపాటి సుధాకర్ మూర్తి, దేవతి శివకుమార్, డి.రవి కుమార్, ఎ.నాగ సతీష్ నిర్వహించారు.

బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం బ్రాడీపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు జె.పార్థసారథి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీ ఎన్జీవో నాయకుడు ఎం. నరసింహమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులంతా డీఏ, పీఆర్సీ, ఇతర బకాయిలు అందించాలని కోరారు. సేవా సమితి కార్యదర్శి పీఎస్ శివన్నారాయణ, బి.మల్లికార్జున శర్మ, నరసింహారావు, గౌరీనాథ్, అరుణ్ కుమార్, వేణుగోపాలరావు, సీతా రమేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: పేకాటాడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. కార్మికుల కాలనీలోని బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వీరి నుంచి రూ.4,260 స్వాదీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

బేతపూడిలో..

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో పేకాట శిబిరంపై దాడిచేసిన పోలీసులు ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేకాట శిబిరంపై దాడులు చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.6,150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యోగా క్యాలెండర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానం ఆవరణలో మంగళవారం మంగళగిరి పట్టణానికి చెందిన శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నూతన సంవత్సర యోగా క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్ విచ్చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యోగ సాధన ద్వారా మనిషి ఒత్తిడిని జయించవచ్చని అన్నారు. శ్రీ రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ, యోగ సాధకులు జోగిపర్తి శ్రీహరిరావు, కందం రాంబాబు, జె.నారాయణ, కాండ్రు కోటేశ్వరరావు, పి.చంద్రశేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



రాష్ట్ర సమాచార కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

రావెల(తాడికొండ): సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర సమాచార కమిషనర్ టి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తాడికొండ మండలం రావెల గ్రామంలో వేమన కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పరిషత్ ఉపాధ్యక్షులు భీమవరపు ధర్మారెడ్డి, ఈమని, భాస్కర్‌రెడ్డి, వంగపాటి బ్రహ్మం, ఏరువ లూర్దురెడ్డి, సింహాద్రి మధుసూదన్‌రెడ్డి, వరగాని వెంకటేష్ పాల్గొన్నారు.

భవన విజయం!

- గత ప్రభుత్వంలో పునాదులకే పరిమితమైన జీజీహెచ్ ఎంసీహెచ్ భవనం
- నాడు రెండుసార్లు శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం చంద్రబాబు
- 2022 అక్టోబరులో శంకుస్థాపన చేసిన మంత్రి విడదల రజిని
- 14 నెలల్లోనే నాలుగంతస్తుల భవన నిర్మాణం
- మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఎంసీహెచ్ వార్డు
- రూ.86 కోట్లతో ప్రభుత్వం, జింఖానా సంయుక్త ఆధ్వర్యంలో నిర్మాణం



ఎంసీహెచ్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి విడదల రజిని, ఇతర ప్రజాప్రతినిధులు (ఫైల్)

గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు ఇచ్చి గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎంసీహెచ్ వార్డు నిర్మాణం చేపట్టాలని గత తెలుగుదేశం ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. అయితే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రెండుసార్లు ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు శంకుస్థాపనలు చేశాడే తప్ప, ఒక్క ఇటుక కూడా వేయలేదు. భవన నిర్మాణం కోసం తవ్విన గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండి క్రిమికీటకాలు చేరి ఆసుపత్రిలో ఉండే రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న ఎంసీహెచ్ వార్డు భవన నిర్మాణాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు ప్రారంభించింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే మొట్టమొదటి ప్రాధాన్యతగా ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

మంత్రి విడదల రజిని చొరవ..

మహిళల కష్టాలు తెలుసుకున్న మంత్రిగా, ముఖ్యంగా గర్భిణుల బాధలను స్వయంగా చూసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎంసీహెచ్ నిర్మాణ పనులపై దృష్టి సారించించారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఎంసీహెచ్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చొరవ చూపించారు. అనంతరం 2022 అక్టోబరులో జింకానా సభ్యులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి హామీ ఇవ్వడంతో కేవలం 14 నెలల వ్యవధిలో నాలుగు అంతస్తుల భవన నిర్మాణం జరిగింది. ఎంసీహెచ్ భవన నిర్మాణం పూర్తయ్యే వరకు స్త్రీలు, గర్భిణులు ఇబ్బంది పడకుండా సీఐఏ సంస్థతో మాట్లాడి కార్పొరేట్ రెస్పాన్సిబులిటీలో భాగంగా గైనిక్ వార్డును ఆధునికీకరించేందుకు రూ.67 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం కాన్పుల వార్డు ఆధునికీకరణ పనులు సైతం చురుగ్గా జరుగుతున్నాయి.



నాలుగంస్తులు పూర్తయిన జీజీహెచ్‌లో ఎంసీహెచ్ భవనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో ...

ఎంసీహెచ్ నిర్మాణ పనులపై సర్వత్రా సందేహాలు, ఆందోళనలు వైద్యుల్లో వ్యక్తం అయ్యాయి. నాటి జింకానా అధ్యక్షుడు, అమెరికాకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి 2019 జూలై నెలలో గుంటూరు వచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి జింకానా వైద్యుల్లో ఉన్న సందేహాలు వ్యక్తం చేసి ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి అప్పటి ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డికి ఆదేశాలు ఇవ్వటంతో నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. జవహర్‌రెడ్డి జీజీహెచ్‌కు వచ్చి ఎంసీహెచ్ నిర్మాణ పనులు స్వయంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలన్నర వ్యవధిలోనే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసే దిశగా అడుగులు వేసింది. అందులో భాగంగా ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్‌లో నిర్మాణానికి నోచుకోకుండా శిలాఫలకాలకే అంకితమైన ఎంసిహెచ్ వార్డు నిర్మాణ పనులపై దృష్టి సారించింది.

మాతాశిశు మరణాల తగ్గింపే లక్ష్యం..

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఎంసీహెచ్ వార్డు నిర్మాణం జరుగుతుంది. పూర్వ వైద్య విద్యార్థులంతా విరాళాలు సేకరించి మాతృరుణం తీర్చుకునేందుకు రూ. 86 కోట్లతో ఎంసీహెచ్ వార్డు నిర్మిస్తున్నారు. మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా భవన నిర్మాణం జరుగుతోంది. ఎంసీహెచ్ వార్డు నిర్మాణం సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, ఐదంతస్తులతో జరుగుతోంది. స్త్రీ, ప్రసూతి వైద్య సేవలతోపాటు, శిశు వైద్య సేవలకు ప్రత్యేకంగా గదులను నిర్మిస్తున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల మేరకు ఎంసీహెచ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా లేని విధంగా కేవలం తల్లి, బిడ్డ వైద్య సేవల కోసం ఐదు అంతస్తుల భవన నిర్మాణం జరుగుతుండడం ఇదే మొట్టమొదటిసారి. భవనంలో 600 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఎంసీహెచ్ వార్డు నిర్మాణం పూర్తయితే పోస్టు ఆపరేటివ్ వార్డు, ప్రీ ఆపరేటివ్ వార్డు, ఆపరేషన్ థియేటర్, ఎన్ఐసీయూ, ల్యాబ్, డిస్పెన్సరీ, డెలివరీ సూట్స్, తల్లులు వేచి ఉండే గది అన్నీ కూడా ఒకే భవనంలో అందుబాటులోకి వస్తాయి. కార్పొరేట్ ఆస్పత్రి మాదిరిగా ఒకేచోట అన్ని వైద్యసౌకర్యాలు ఉండటం ద్వారా తల్లికి, బిడ్డకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. తద్వారా తల్లి బిడ్డ మరణాలు సైతం తగ్గుముఖం పడతాయి.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాల ప్రత్యేక చొరవతో నేడు ఎంసీహెచ్ భవన నిర్మాణం నాలుగంతస్తులు పూర్తయింది. మరో మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పనులు చేస్తున్నారు. ఎంసీహెచ్ వార్డు నిర్మాణం ఆసుపత్రి చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతోంది. భవన నిర్మాణానికి విరాళాలు అందజేసి జీజీహెచ్ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటు నందిస్తున్న జింకానా వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

పబ్లిసిటీకి వాడుకున్న చంద్రబాబు...

గత టీడీపీ పాలనలో ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులను చంద్రబాబు నాయుడు ప్రచారానికి వాడుకున్నారనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. గత ప్రభుత్వ పాలనలోని ఐదేళ్లల్లో ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న సామెత చందాన ఉన్న గుంటూరు జీజీహెచ్‌లోని మాతా, శిశు ఆరోగ్య సంరక్షణవార్డు (ఎంసీహెచ్ వార్డు) నిర్మాణ పనులు ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వంలో ఒక్క అంగుళం కూడా పనులు ముందుకు జరగలేదు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి హోదా 2015 అక్టోబర్ 2వ తేదీన గుంటూరు జీజీహెచ్‌కు వచ్చి శిలాఫలకం వేశారు. ఏడాదిలో భవన నిర్మాణం పూర్తిచేసి మెరుగైన వైద్యసేవలను అందించాలని నాడు చంద్రబాబు వైద్యాధికారులకు, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయన ఆదేశించినా ఎంసీహెచ్ భవనం నిర్మాణం ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదు. మరలా రెండోసారి చంద్రబాబునాయుడు 2018 డిసెంబర్‌లో జీజీహెచ్‌కు వచ్చి ఎంసీహెచ్ వార్డు నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

పొలం గట్ల తగాదాలో కత్తితో వ్యక్తిపై దాడి

గుంటూరు రూరల్: పొలంగట్ల వద్ద ఏర్పడిన తగాదాలో ఒక వ్యక్తిపై ప్రత్యర్థులు కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం చౌడవరం గ్రామానికి చెందిన తోకల శివనాగేశ్వరరావు స్థానికంగా పొలం పనులు చేసుకుని జీవిస్తుంటాడు. అతని పొలం పక్కనే యనగంధాల శ్రీరామయ్య పొలం ఉంది. ఎప్పటినుంచో ఇరువురి మధ్యన పొలం హద్దుల తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శివనాగేశ్వరరావు తన పొలం వద్ద పనిచేసుకుని ఇంటికి తిరిగి ద్విచక్రవాహనంపై వెళుతుండగా శ్రీరామయ్య అతని వద్దకు వచ్చి కొబ్బరిబోండాలు నరికే కత్తితో దాడిచేశాడు. దీంతో శివనాగేశ్వరరావుకు తల కడుపులో, చాతీపై, బుజంపై తీవ్రగాయాలయ్యాయి. హత్య చేసేందుకు కుట్రవన్నాడని తేరుకుని శివనాగేశ్వరరావు తన ద్విచక్రవాహనంపై అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటికి చేరుకుని బంధువులతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వెళ్ళారు. జీజీహెచ్‌లో పరీక్షించిన వైద్యులు శివనాగేశ్వరరావు పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. శివనాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మకరజ్యోతి దర్శనం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రామాలయం వద్ద మకర సంక్రాంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి 22 కిలోల కర్పూరంతో మకరజ్యోతిని వెలిగించారు. కార్యక్రమానికి ముందుగా హరిహర సుత అయ్యప్పస్వామికి అర్చకులు రాజేంద్రశర్మ పూజలు చేశారు. అనంతరం ఆలయం వెలుపల ఏర్పాటుచేసిన ప్రదేశంలో 22కిలోల కర్పూరంతో జ్యోతిని వెలిగించారు. అనేక మంది భక్తులు అయ్యప్పనామస్మరణ చేస్తూ జ్యోతిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్యసంఘపెద్దలు డి.నరేంద్రకుమార్, జి.మధుసూదనరావు, కె.వెంకటేశ్వరరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ముగిసిన ధార్మిక శిక్షణ తరగతులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం మస్జిద్ ఎ మొహమ్మద్‌తో నిర్వహిస్తున్న ధార్మిక శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్దుర్రహ్మాన్ విచ్చేసి మాట్లాడారు. ఇల్మ్ ప్రాముఖ్యతపై అబ్దుల్ హఫీజ్ ఉమ్రీ, బిద్ అత్ పర్యవసానం అనే అంశంపై అబ్దుల్ మబూద్ జామిఈ, సున్నత ప్రాముఖ్యతపై అబ్దుల్లా జామిఈ, షిర్క్ (బహు దైవారాధన) అనే అంశంపై ఇల్యాస్ దాయీ, ఉలమాయే దీన్‌కి ఫజీలత్ అనే అంశంపై ఫయాజ్ ఆలమ్ అల్వానిలు ప్రసంగించారు.

చర్మకార సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులుగా సుబ్బారావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల చర్మకార సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా కంఠంరాజు కొండూరుకు చెందిన కొండూరు సుబ్బారావును రాష్ట్ర సంఘం నియమించింది. మంగళవారం ఆ నియామకపత్రాన్ని ఏపీ చర్మ కార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు కంఠంరాజు కొండూరు గ్రామంలో కొండూరు సుబ్బారావుకు అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో చర్మకారులు, డప్పు కళాకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసువెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని, రాష్ట్ర చర్మకార సంక్షేమ సంఘం తనపై ఉంచిన బాధ్యతను నిర్వహిస్తానని అన్నారు.

రావుల శివారెడ్డికి నివాళి

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణభవన్‌లో మంగళవారం సీపీఐ నియోజకవర్గ మాజీ కార్యదర్శి రావుల శివారెడ్డి మూడో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శివారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ల వెంకటయ్య పాల్గొన్నారు.

డాక్టర్ రమణ యశస్వీకి సన్మానం

లక్ష్మీపురం: కళారత్న డాక్టర్ రమణ యశస్వీ ఆర్థోపెడిక్‌గా కవిగా, రచయితగా సంఘ సేవకుడిగా అన్ని రంగాలలో రాణిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా అందరి అభిమానం పొందుతున్నారని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, ఎస్.హెచ్.ఓ అధ్యక్షులు డాక్టర్ సేవాకుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రమణ యశస్వీని సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.వి.రామ్‌కుమార్, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

మాట– మాట..

మూడు రోజులుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మంగళవారం మాట– పాట కార్యక్రమం నిర్వహించారు. వేడుకలకు కళాసాధ అధ్యక్షుడు బిళ్లా అశోక్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ప్రముఖ గాయకులు రత్నాజీ, కవులు జమదగ్ని, రాజశేఖర్, ఎ.నారాయణ, భాగ్యలక్ష్మీ, సాయిబాబు, పోతురాజు, మల్లేశ్వరరావు, జయలక్ష్మీ, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.



సాంస్కృతిక విప్లవకారుడు త్రిపురనేని

పాత గుంటూరు: తెలుగు సమాజంలో కవి రాజు త్రిపురనేని రామస్వామి హేతువాద భావజాలంతో సాంస్కృతిక విప్లవకారుడిగా చరిత్రలో ప్రసిద్ధి చెందారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. రింగ్ రోడ్డు లోని ఆర్‌వీఆర్ జేసీ కళాశాలలో కవిరాజు త్రిపురనేని రామస్వామి వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గద్దె మంగయ్య, అలోకం పెద్దబ్బాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అలోకం పెద్దబ్బాయి మాట్లాడుతూ తెలుగు సమాజంలో సాహిత్య, సాంస్కృతిక, భావజాల రంగాల్లో తన హేతువాదంతో త్రిపురనేని రామస్వామి పోరాటం చేశారన్నారు. అనంతరం విల్సన్‌కు కవిరాజు త్రిపురనేని రామస్వామి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ మాజీ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, ప్రముఖ సాహిత్య పరిశోధకుడు పారా అశోక్ కుమార్, వల్లూరి తాండవ కృష్ణ, రచయిత జొన్నలగడ్డ రామారావు పాల్గొన్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి రాసిన గీతాలను పి.వి. రమణ బృందం ఆలపించారు.



త్రిపురనేని పురస్కారంతో సన్మానిస్తున్న పాపినేని

భారత సైనికుల సేవలను స్మరించుకోవాలి

తెనాలిఅర్బన్: దేశం కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న భారత సైనికుల సేవలను అందరూ స్మరించుకోవాలని విశ్రాంత ఆర్మీ అధికారి మోహనరావు, 22వ ఆంధ్రా బెటాలియన్ అధికారి సుబేదార్ అవతార్ సింగ్ పేర్కొన్నారు. భారత సైనిక దినోత్సవాన్ని సోమవారం కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ భారత కమాండర్ ఇన్ చీఫ్‌గా కరియప్ప బాధ్యతలు స్వీకరించిన రోజును అందరు ఆర్మీ డేగా జరుపుకుంటారని చెప్పారు. దేశ క్షేమం కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ సైనికులు అందించే సేవలు మరువరానివని చెప్పారు. అనంతరం డ్రాయింగ్, వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అవతార్‌సింగ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబి, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, ఉపాధ్యాయులు పసుపులేటి మోహనరావు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

తెనాలిరూరల్: తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. తెనాలి సుల్తానాబాద్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వెంబడి మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఎస్ఐ ఎం విజయ్ కుమార్‌కు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ ఏఎస్ఐ హైదర్ అలీ, పీసీలు పి.మురళి, ఎం.అంకయ్యలతో కలసి అక్కడకు చేరుకున్నారు. ప్లాస్టిక్ గోతాల్లో మద్యం సీసాలను ఉంచి విక్రయిస్తున్న ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులను సుల్తానాబాద్‌కే చెందిన కాట్రోతు శ్రీనునాయక్, రమావత్ కార్తీక్‌నాయక్ లుగా గుర్తించారు. వారి వద్ద నుంచి 50 మ్యాన్షన్ హౌస్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలంగాణలోని కోదాడకు వెళ్లి అక్కడి వైన్ షాపులలో మద్యం కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను పట్టుకోవడంలో అప్రమత్తంగా వ్యవహరించిన ఎస్ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.



కేసు వివరాలు తెలుపుతున్న సీఐ రమేష్‌బాబు

బ్లడ్‌బ్యాంకుకు సామగ్రి అందజేత

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. పొదిల ప్రసాద్ బ్లాక్‌లోని రెండో బ్లడ్ బ్యాంక్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఉదయ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ రామకృష్టా రెడ్డి రూ.2 లక్షల విలువ చేసే పరికరాలను బ్లడ్ బాంక్‌కు అందజేశారు. ఈ పరికరాలను డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రామకృష్టా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రక్తంలోని ప్లాస్మాను, రక్త కణలను వేరు చేసే సెంట్రి ఫ్యూస్, బ్లడ్ బ్యాగ్ సీల్ పరికరాలు డాక్టర్ రామకృష్టా రెడ్డి అందించారన్నారు. ఆస్పత్రిలో రెండో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి ఆపరేషన్ థియేటర్‌లకు అందుబాటులో ఉంచామని చెప్పారు. గతంలో బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లాలంటే కష్ట తరంగా ఉండేదని ప్రస్తుతం కొత్తగా ఆధునికీకరించిన రూ.40 లక్షల వ్యయంతో నిర్మించి రెండు ఆపరేషన్ థియేటర్‌ల వద్ద బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డాక్టర్ రామకృష్టా రెడ్డి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించానన్నారు. తన వంతు సహాయంగా ఈ పరికరాలను అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.సురేష్, సివిల్ సర్జన్, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.



డాక్టర్ కిరణ్‌కుమార్‌కు పత్రాలను అందజేస్తున్న డాక్టర్ రామకృష్టారెడ్డి

మంచాలలో ఘనంగా గ్రామోత్సవాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామి వార్ల గ్రామోత్సవ కార్యక్రమాలు వైభంగా జరిగాయి. మండల కేంద్రమైన చేబ్రోలు, మంచాల, శలపాడు, శ్రీరంగపురం, నారాకోడూరు, శేకూరు తదితర గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి కల్యాణోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం స్వామి వార్లు ప్రధాన రహదారుల్లో ఊరేగింపు జరిగింది. చేబ్రోలులోని ప్రధాన దేవాలయాలైన సంక్రాంతి పండుగ రోజున నాగేశ్వర స్వామి, బీమేశ్వరస్వామి, ఆదికేశవస్వామి, రంగనాథస్వామి, జ్వాలా లక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం

డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఈమని అప్పారావు

తాడేపల్లిరూరల్: యువతీ యువకుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని డీవైఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ఐద్వా, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అప్పారావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని అన్నా రు. విజేతలకు బహుమతులు అందజేశారు. దర్శి చిన్న దుర్గారావు, బొందలపాటి ప్రభాకరరావు, బూరగ జయరావు, నవనీతం, బూరగ కిట్టు, చిన్న, శ్రీకాంత్,సాయి, యం.చిన్న చెన్నయ్య పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి అప్పారావు

దుగ్గిరాలలో...

దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్, వాలీబాల్, కబడ్డీ పోటీలను డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు మంగళవారం బహుమతులను జెట్టి బాలరాజు అందజేశారు. కార్యక్రమంలో వమన్న నరసింహారావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, బి. చిరంజీవి, జి.యోహాను, అజయ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మానికొండ ముత్యాలరావుకు నివాళి

తాడేపల్లిరూరల్: సీపీఐ నాయకుడు మానికొండ ముత్యాలరావు 43వ వర్ధంతి సభను మంగళవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షత వహించగా, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు గుంకట సాంబిరెడ్డి, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు గుంటక సాంబిరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ముత్యాలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, సీనియర్ నాయకులు మానికొండ డాంగే తదితరులు పాల్గొన్నారు.